RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 472 | 17 సెప్టెంబర్ గురువారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ..

# 30 రోజుల్లో నివేదిక

### : రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు.జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు.అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## అంతా అబద్ధం..

### రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు.

'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సెప్టెంబర్ 17 వేడుకలు

### : కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి..

### రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'

### .. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు



మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు.22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ

# అధికారంలోకి తెస్తారు

### : శ్రీధర్ బాబు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..

### సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ



భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.

ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది.రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్–జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు.ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్–షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# జిందాల్ వర్సిటీకి కేటీఆర్.. ఎంపీ రవిచంద్ర

## - తెలంగాణ రాష్ట్ర సాధన, పదేళ్ల పాలనలో సంస్కరణలు, అభివృద్ధిపై విద్యార్థులతో ప్రసంగం

**హర్యానా, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ దీవకొండ దామోదర్ రావు, రాజ్యసభ మాజీ సభ్యుడు కే.ఆర్.సురేష్ రెడ్డి బుధవారం హర్యానాలోని సోనేపట్‌లో ఉన్న ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీ ఉపకులపతి రాజ్‌కుమార్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ప్రస్థానం, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పదేళ్ల పాలనలో చేపట్టిన ఆవిష్కరణలు, అమలు చేసిన సంస్కరణలు, సాంకేతిక రంగంలో సాధించిన పురోగతి, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే క్షమించరు

## - అమరధామంలో పోరాట యోధులకు వామపక్ష నాయకుల నివాళి



**పరకాల, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని అమరధామంలో సాయుధ పోరాట యోధులకు నివాళు లర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. నిజాం పాలనలో దోపిడీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రైతాంగ పోరాటం సాగిందన్నారు. ఈ పోరాటంతో నాలుగు వేల గ్రామాలు విముక్తి పొందాయని, పేదలకు వేలాది ఎకరాల భూములను పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఇతరులు తమదిగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ విమోచన కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సాయుధ రైతాంగ పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, పరకాల మండల కార్యదర్శి దుప్పటి సాంబయ్య, సీపీఎం నాయకులు బొట్ల చక్రపాణి, మంద శ్రీకాంత్, బొచ్చు కళ్యాణ్, బొచ్చు ఆదాం, ఈశ్వర్, బొజ్జ హేమంత్, సీపీఐ నాయకురాలు ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?: జగన్



ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. "చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.
సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# తుమ్మలూర్‌లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బిగ్ షాక్ సబితమ్మ సమక్షంలో గులాబీ గూటికి చేరిన నాయకులు

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 16**



మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. తుమ్మలూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కటికల శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మాజీ మంత్రివర్యులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ చేరికలతో తుమ్మలూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందని స్థానిక నాయకులు తెలిపారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేస్తున్న నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతామని, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని. తుమ్మలూర్ గ్రామంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, గ్రామ అభివృద్ధి కోసం గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ బలోపేతం అవసరమని ఆమె అన్నారు. తుమ్మలూర్‌లో బీఆర్ఎస్ కుటుంబం మరింత విస్తరిస్తుండటం సంతోషంగా ఉందని, కొత్తగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ ప్రజల మధ్య ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులలో గంట నర్సిరెడ్డి (మాజీ సర్పంచ్), జెనిగే శివకుమార్ (వార్డు సభ్యులు), జెనిగే. మహేష్, మద్ది శ్రీధర్ రెడ్డి (మాజీ వార్డు సభ్యులు), బి. అంజయ్య, జి. పర్వతాలు, మూల శేఖర్ గౌడ్ (మాజీ వార్డు సభ్యులు), ఏనుగుల రాములు (మాజీ వార్డు సభ్యులు), ఏ లక్ష్మారెడ్డి, సంపంగి రాజు, జెనిగే ఐలయ్య, ముక్కెరి వెంకటేష్, జి కొండల్, అనుగుల వెంకటేష్, గుమ్మల్ల కరుణాకర్ రెడ్డి, ఎం శ్రీశైలం, జెనిగే జగదీష్, కె శివ, బి యాదయ్య, గునుకుల కృష్ణ, ఎం ప్రభాకర్, జి. దేశరత తదితరులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూర్ బీఆర్ఎస్ నాయకులు గంట వెంకట్ రెడ్డి, రాజమోని రాజు, జి. నర్సింహా యాదవ్, అమంగంటి తులసి రెడ్డి, బి. జంగయ్య, ఆర్. శ్రీనివాస్, వి. సుభాష్, జెనిగే శేఖర్, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొహబ్బత్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యూనిఫాం, టై, షూలను పంపిణీ

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 16**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మొహబత్ నగర్ గ్రామ సర్పంచ్ వర్త్య రాజు నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వర్త్య రాజు నాయక్ మాట్లాడుతూ.. "మన ఊరి పిల్లలు బాగా చదువుకోవాలి. చదువులో ముందుండాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చదువు విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా మన వంతుగా సహాయం చేయాలి. పిల్లలు మంచిగా చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి" అని అన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రి అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లవోలు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు జి. అంజయ్య యాదవ్, ఆంగోత్ శ్రీను, కేతావత్ శ్రీనివాస్, కేతావత్ మంజుల శేఖర్, కొర్ర శోభ, యాట ప్రవల్లిక విష్ణు, సూర్నగంటి రాణి యాదయ్య, అలాగే హేమ్ల నాయక్, శివ యాదవ్, వర్త్య కీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ హనుమాన్ దాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్వర్గీయ బొజ్జ తారకం 10వ వర్ధంతి సభ : పిట్టా వరప్రసాద్‌కు ఘన సన్మానం

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తిరుపతి సెప్టెంబర్ 16:**




శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో 'దళిత ఉద్యమ శిఖరం, బహుముఖ ప్రజ్ఞాశాలి' స్వర్గీయ బొజ్జ తారకం గారి 10వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్‌ను నిర్వాహకులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను (మెమొంటో) అందజేసి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ:
సమాజంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం, దళిత బహుజన ఉద్యమాల బలోపేతం కోసం బొజ్జ తారకం గారు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనలో బొజ్జ తారకం గారి ఆలోచనా విధానాన్ని, పోరాట స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి అంజయ్య అధ్యక్షత వహించగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు గారు ముఖ్యఅతిథిగా, ప్రొఫెసర్ కోయ కోటేశ్వరరావు, పలువురు ప్రముఖులు, ప్రజాసంఘాల నేతలు మరియు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు ఎమ్మార్పీఎస్ నిరసన

## - హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్..

## - గొర్రెకుంటలో దిష్టిబొమ్మ దహనం

**గీసుగొండ, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**



డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన రాసిన పుస్తకాన్ని విడుదల చేయకుండా నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ముద్రించిన ప్రతులను స్వాధీనం చేసుకుని, హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ నగరంలోని 15వ డివిజన్ గొర్రెకుంటలో బుధవారం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లెమెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లెమెంట్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలతో పుస్తకం రాసి ఆయనను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను కించపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. వివాదాస్పద పుస్తకాన్ని విడుదల చేయకుండా నిలిపివేసి, ముద్రించిన ప్రతులను స్వాధీనం చేసుకోవడంతో పాటు హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతాయని క్లెమెంట్ తెలిపారు. అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాశి ప్రేమ్ సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సురేష్, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన కార్పొరేటర్ ఏ.లగొండ ప్రవీణ్, విలీన గ్రామాల అధ్యక్షుడు ల్యాథల్ల చిన్ని, గీసుకొండ మండల అధ్యక్షుడు బరిగల యాకయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడిపాక సంజీవ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోట బాబు, ఆటో యూనియన్ నాయకుడు కట్కూరి రాజయ్య, కోయిల సాల్మన్, మచ్చ కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రామగుండం పోలీస్ కమిషనర్

**హైదరాబాద్ ఎస్టేట్ 16సెప్టెంబర్**

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, సీఐ రమేష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కను నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచడంతో పాటు, వాటికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బంది బ్యారక్‌ను తనిఖీ చేసి పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన అంశాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ కీలకమైన ప్రాంతంలో ఉందని, హైవే, రైల్వే స్టేషన్‌తో పాటు కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్నందున శాంతిభద్రతలు, రహదారి భద్రత, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించి, ఆస్తి నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్న పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటించి భద్రతా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. వృద్ధుల భద్రత కోసం ప్రత్యేక ప్రామాణిక కార్యాచరణ విధానం ( యస్ఓపి ) రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు పోలీస్ స్టేషన్ నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ, ఎస్ఐ లకు సూచించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని పేర్కొంటూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీపీ ఆదేశించారు.





# ప్రభుత్వ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

## - వర్షం పడితే విద్యార్థులకు అవస్థలు..

## - మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

**పరకాల, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**

పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాలలను సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ.. వర్షం పడిన ప్రతిసారీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిలిచిన నీరు వారం, పది రోజులైనా బయటకు వెళ్లకపోవడంతో తరగతులకు హాజరుకావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మైదానంలోనూ నీరు నిలవడంతో సాయంత్రం వేళల్లో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని హేమంత్ తెలిపారు. కళాశాల ప్రారంభోత్సవం సమయంలో తాత్కాలిక పనులు చేపట్టి, అనంతరం సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు.




భవనాలను ఆకర్షణీయంగా కనిపించేలా గోడలు నిర్మించి రంగులు వేయడానికే పరిమితం కాకుండా విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని హేమంత్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎండీ అఫ్రోజ్, పరకాల బాలికల విభాగం కన్వీనర్ శ్రీ వర్ష, కళాశాల అధ్యక్షుడు సాహిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

## - సంగెంలో బీఆర్ఎస్ యువనేతల ముందస్తు అరెస్టు..

## - ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం




**సంగెం, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు సందర్భంగా సంగెం మండలానికి చెందిన బీఆర్ఎస్ యువనేతలు పెండ్లి పురుషోత్తం రెడ్డి, బొమ్మాల శంకర్, పోశాల ప్రవీణ్, జున్న రాజు, చిర్ర రాజులను పోలీసులు బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు వారి ఇళ్ల నుంచి తీసుకువచ్చి సంగెం పోలీస్‌స్టేషన్‌లో ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ముందస్తు అరెస్టులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై తమ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

# హసన్పర్తి ఆర్టీసీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు...

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ శ్రీ కెఆర్ నాగరాజు గారి ఆదేశాల మేరకు +౩౮జ 1 వ డివిజన్ ఎర్రగట్టు గుట్ట ఆజ కాలనీ పద్మశాలి కాలనీలో సీసీ డ్రైనేజీ ఏర్పాటు శంకుస్థాపన కార్యక్రమశీలో డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము గౌడ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య,వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఇది వరకు కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన డ్రైనేజీ,రోడ్ల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం అయితేనే పరిసరాలు పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు.ప్రజా పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ముందడుగులు వేస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా



నిలుస్తుండన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరకొండ అనిల్,సారంగపాని,మూల తిరుపతి, మూల నరోత్తం,వీసం సురేందర్,డబ్బా శ్రీను, భరత్ శ్రీనివాస్,ఆజ కాలనీ ప్రజలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హిందీ వారోత్సవాల్లో ప్రతిభకు పదును

## - వ్యాసరచన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు




**బిచ్కుంద, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిచ్కుందలో హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ రచనా ప్రతిభను ప్రదర్శించారు. హిందీ భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# హత్య కేసును చేదిన్చిన మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు..

## 13 మంది నిందితుల్లో 8 మందిని అదుపులోకి తీసుకున్నా మనీ కమిషనర్ సుమతి వెల్లడి..

## 24 గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులను అభినందించిన కమిషనర్.

## యుక్త వయసు, అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ హత్య

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్ :సెప్టెంబర్ 16..**

నాగోల్ పీఎస్ పరిధిలో బండ్లగూడ సుప్రీం వైన్స్ వద్ద జరిగిన దారుణ హత్య కేసును ఎస్ఓటీ, నాగోల్ పోలీసులు చేధించారు . మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ

ఎండీ నయీమ్ హత్య కేసులో మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని మృతుడు కారు డ్రైవర్ నయీం బండ్లగూడ నాగోల్ నివాసం ఉంటాడని సమావేశంలో తెలిపారు.హత్యకు ప్రధాన సూత్రధారి రబ్బానీ, కనకం ఉమా మహేష్‌గా గుర్తించామని మృతుడు నయీమ్ పాత నేరస్తుడని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పీఎస్‌లో రౌడీషీట్ ఉందని , గతంలో పదకొండు క్రిమినల్ కేసులు,హత్య కేసులో ఉన్నాడని పేర్కొన్నారు.మాదాపూర్ లో జరిగిన ఓ ఫంక్షన్ లో నయీం కు రబ్బానీ (పాండిచ్చేరి) తో పరిచయం, ఒకే మతానికి చెందిన వారవడంతో దగ్గరయ్యారని,ఇద్దరు కలిసి ఒకే రూమ్ లో ఉంటూ, నయీం తన కన్నా చిన్న వయసు రబ్బానీ ని శారీరకంగా, మానసికంగా, తల్లి దండ్రుల ను తిడుతూ వేదించే వాడని, తన రూమ్ నుండి మారదాం అనుకుంటే తనను చంపేస్తానని, సోషల్ మీడియా లో నీ పరువు తీస్తానని బెదిరించే వాడని, ఆ కారణం తో హత్య చేయబడ్డాడని అన్నారు.

మృతుడు మహ్మద్ నయీమ్, నిందితులు ఉమా మహేష్ , ఓట్ల దినకర్ చిన్ననాటి స్నేహితులని

గతంలో వీరి మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవని,గత రెండు నెలలుగా నయీమ్‌కు, ఉమా మహేష్, రబ్బానీ, దినకర్‌లతో విభేదాలు పెరిగాయని, రబ్బానీతో పాటు ఉమా మహేష్, దినకర్ లను ఫోన్‌లో, స్నేహితుల సమక్షంలో బెదిరిస్తూ, దూషిస్తూ,సోషల్ మీడియాలో కూడా తమను అవమానించేలా, కుటుంబ సభ్యులను దూషించేలా పోస్టులు పెడతానని బెదిరించేవాడని తెలిపారు.నయీమ్‌ను హత్య చేయాలని కనకం ఉమా మహేష్, రబ్బానీ (పాండిచేరి )కుట్ర పన్నారు

సయ్యద్ రబ్బానీ, మాజీ జైలు సహచరుడు రాసుమల్ల సాకేత్ సహాయంతో నయీమ్‌పై ఉన్న కక్షతో హత్యకు సహకరించాడు2024 - 25లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో నయీమ్ తనను వేధించాడనే కారణంతో సాకేత్ కూడా నయీమ్‌పై కక్ష పెంచుకున్నాడని,సాకేత్ ద్వారా ఒల్లిపోల్ల మహేష్, అతని సహచరులు నయీం హత్యకు సహకరించారన్నారు.ఈ నెల 13న రబ్బానీ, మహేష్, రాఘవేందర్, వెంకట్, ఇస్మాయిల్ జబీ ఎల్‌బీనగర్ నుంచి ఖమ్మం వెళ్ళి అక్కడ దినకర్, బద్రి అలియాస్ మహమ్మద్ భద్రుల్లా హుస్సేన్ , ఉమా మహేష్‌లను కలిసి అక్కడ హోటల్ లో బస చేసారు. నయీమ్‌ను



ఎలా హత్య చేయాలనే దానిపై ప్లాన్ చేశారు.అదే రోజు దినకర్ వారికి ఒక కారు ఏర్పాటు చేశాడు.ఈ నెల 14 సాయంత్రం 4 గంటల సమయంలో నిందితులు ఎల్‌బీనగర్‌కు చేరుకుని రెండు బైకులు, కారులో బండ్లగూడలోని సుప్రీమ్ వైన్స్ సమీపానికి వెళ్ళి అక్కడ సాకేత్, చరణ్ గౌడ్, కార్తీక్‌లను కలిశాక,నయీం వైన్స్ లో ఉన్న సమయంలో మొదట నయీమ్ కళ్లలో కారం చల్లగానే,నయీమ్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు.

నిందితులు వెంబడించి వేట కొడవలితో,ఇనుప కడాయితో తల పై దాడి చేశారు తీవ్ర గాయాల కారణంగా నయీమ్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు.హత్యకు ఉపయోగించిన వేట కొడవలి, ఇనుప కడాయి, సుత్తి, టొయోట కారు ఎ పి 40ఎచ్ ఎం 4669, రెండు టూ వీలర్లు టీఎస్ 28 హెచ్ 3703 గ్లామర్ టి జి 10 డి 0 2 8 2 సుజుకి యాక్సెస్లను స్వాధీనం చేసుకున్నట్టు, పబ్లిక్ లో హత్య చేస్తే ఈజి గా తప్పించుకోవచ్చని నిందితులు ప్లాన్ చేశారని పేర్కొన్నారు...

# అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

## - సెప్టెంబర్ 30 వరకు అవకాశం..

## - కొత్తగా చేరే వారితో పాటు ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకూ వర్తింపు

**బిచ్కుంద, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువును సెప్టెంబర్ 30, 2026 వరకు పొడిగించినట్లు స్థానిక లర్నర్స్ సపోర్ట్ సెంటర్216, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), బిచ్కుంద సమన్వయకర్త డాక్టర్ జి. రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కొత్తగా డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులతో పాటు ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా నిర్ణీత గడువులోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. ప్రవేశాలు, ఫీజు చెల్లింపులకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 73829 29816 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 సెప్టెంబర్ గురువారం 2026

# నువ్వా .... నేనా....



**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి)**

మండల కేంద్రం లోని ముకుందపురం గ్రామ పంచాయతీ పరిధిలో పది లక్షల రూపాయలు తో సి సి రోడ్ మంజూరు అయి రెండు నెలలు దాటినా ఇంత వరకు పని మొదలు పెట్టక పోవడం స్థానిక ప్రజాప్రతినీదుల నీర్లక్షముఅని గ్రామ ప్రజలు అంటున్నారు

గ్రామ చివరి నుండి జమ్మికుంట చెట్టు వరకు సి సి రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల కు ఇబ్బంది లేకుండా చూడాలి అని కోరుకుంటూన్నారు కావున ఇకనైనా గ్రామ ప్రజల తో కలిసి సి సి రోడ్డు వేసి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

వచ్చిన రోడ్డు ను మళ్ళీ పోకుండా చూడవలిసిన బాధ్యత సర్పంచ్ పై ఉంది అని ప్రజలు కోరుతున్నారు ఈ కార్యక్రమం లో స్థానిక గ్రామ ప్రజలు పాలుగోన్నారు.




CPM పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతంగ పోరాట యోధుల స్ఫూర్తితో జూవీ పార్టీ సరూర్ నగర్ సర్కిల్ యల్ బి నగర్ సర్కిల్ హయత్ నగర్ సర్కిల్ కమిటీ చింతల్ కుంట చౌరాస్తా నుండి యల్ బి నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీ లో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ దొడ్డి కొమరయ్య జాటోత్ తాను నాయక్ షేక్ బందగి తో పాటు ఎంతోమంది ఎర్ర జెండా చేత పట్టి పోరాటంలో పాల్గొన్నారు దాదాపు నాలుగు వేల మంది ఈ పోరాటంలో అమరులయ్యారు భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టు వారి ఆధ్వర్యంలో పోరాటం సాగించారు ఆనాటి నిజాం నవాబ్ కాసిం రిజ్వి విష్ణుర్ దొరలకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు ఆనాడు పోరాడిన అమరులను అలాగే చరిత్రను వక్రీకరిస్తూ కేంద్రంలో ఉన్న బిజెపి ఇదేదో మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారు అసలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బిజెపి పాత్ర గాని ఆర్ఎస్ఎస్ పాత్ర గాని లేనప్పటికీ ఇదేదో మతాల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుతున్నది అలాగే రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అణగారిన వర్గాలను పట్టించుకోకుండా నియంతల ప్రవర్తిస్తున్నాడు అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇండ్లు ఇవ్వకుండా సవుతి తల్లి ప్రేమ కురిపిస్తుంది ఇప్పటికైనా స్పందించి పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో జూవీ పార్టీ సరూర్ నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న యల్ బి నగర్ సర్కిల్ కార్యదర్శి ఎలయ్య యం గోపి నాయక్ ఆర్ పాండు నాయక్ కె హరీష్ నాయక్ ఖసయ్య సుమన్ నాయక్ తో వందలాది ప్రజలు పాల్గొన్నారు

## తీరనున్న ఎల్బీనగర్ ప్రజల చిరకాల వాంఛ

118 +ూపై త్వరలోనే క్లియరెన్స్ వస్తుందని అసెంబ్లీలో ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి ఎల్బీనగర్ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా 118 జీవో సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ సమస్యను ఓట్ల కోసం రాజకీయంగా వాడుకున్నారే తప్ప, ఇక్కడ పాలించిన ఏ నాయకుడు ప్రజల బాధను పట్టించుకోలేదు.గతంలో ఈ ప్రాంత ఎంపీగా ఉన్న సమయంలో ఈ సమస్యపై అనేక వేదికలపై పోరాడిన రేవంత్ రెడ్డి గారు, నేడు ముఖ్యమంత్రి హోదాలో 118 జీవోపై స్పష్టమైన ప్రకటన చేయడం హర్షనీయం.ఈ రెగ్యులరైజ్ చేయడం వల్ల నియోజకవర్గంలోని 9500 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మరోసారి ఎల్బీనగర్ ప్రజల పక్షాన నిలిచిన శ్రీ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

జక్కిడి శివచరణ్ రెడ్డి
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ యువజన కాంగ్రెస్

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు : శ్రీకాంత్ రెడ్డి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది.తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు.చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు.అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.రాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

# నిమజ్జనంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు!

## - డీజే, సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు గీసుకొండ పోలీసుల కౌన్సెలింగ్..
## - అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని సూచన

**గీసుకొండ, సెప్టెంబర్ 16 హైదరాబాద్ ఎస్టేట్:**

గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గీసుకొండ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, సౌండ్ సిస్టమ్ యజమానులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై న్యాయస్థానాల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసుల సూచనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ప్రజల భద్రతకు, ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి, అనిల్‌కుమార్‌తో పాటు గీసుకొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణలో నేటికీ మారని రజకుల బతుకులు

## రజక రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దాపురం భాస్కర్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ అన్ని వృత్తులలో ప్రత్యక్షమైన వృత్తి రజక వృత్తి. కాలం మారిన వృత్తి మారలేదని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దాపురం భాస్కర్ ఆవేద న వ్యక్తం వ్యక్తం చేశారు . మలిన బట్టలు శుభ్రపరిచేందుకు రసాయన,డిటర్జెంట్ సబ్బులు,సర్ఫ్,పదార్థాలు, లేని కాలంలోనే, సౌడు మట్టిని కనుక్కున్న వ్యక్తి రజకుడు. సౌడు మట్టితోనే మలినమైన మురికి బట్టలని మల్లె పువ్వు వలె ఉతికేవారు. గ్రామాలలో అగ్రకుల పెత్తందారులకు, భూస్వాములు దొరలకు,వెట్టిచాకిరి చేసేవారు. రజకులను చిన్న చూపు చూస్తూ పనివాళ్ళుగా, బానిసలుగా చేసుకొని వారి ఇళ్లలో నిద్రలేచినప్పటి నుండి వెట్టిచాకిరి, కట్టు బానిసలుగా చేసిన పరిస్థితి ఉండేది. ఒక రజకుడు మానవ జననం నుండి మరణం వరకు సేవ చేస్తున్న వృత్తి. ప్రసూతి బట్టలు, ఆడబిడ్డ మ్యచూర్ ఫంక్షన్ బట్టలు, పెళ్ళిళ్ళు, అనారోగుల అన్ని రకాల మలిన బట్టలను, కూడా సేకరించి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులో గానేగాని, వాగులో గాని,మండుతున్న ఎండల్లో ఇబ్బందులు పడుతూ,మలినమైన బట్టలను సౌడుమట్టితో ఉడకబెట్టి, ఉతికి శుభ్రంగా మల్లెపువ్వు వలె తీసుకొచ్చి ఇచ్చేవారు. శుభ్రంగా ఉతికి తెచ్చిన బట్టల పైన కూడా పసుపు నీళ్లు చల్లి ఇంట్లోకి తీసుకునే పరిస్థితి ఆనాడు ఉండేది. రజకులపై పెత్తందారి వర్గం కుల వివక్ష చూపి, శ్రమ దోపిడికి గురి చేసే వారు. శ్రమకు తగిన ప్రతిఫలంగా వేతనం కూడా ఇచ్చేవారు కారు. నాటి నుంచి నేటి వరకు కూడా వివక్షత పెరుగుతూనే ఉంది. కాలం మారిన రజకులపై దోపిడీ చేస్తున్న వ్యవస్థ నేటికీ మారలేదు. నేడు తెలంగాణలో రజకులపై ఏదో మూలన రజకులపై దాడులు వివక్షత సామాజిక బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయి. దోపిడి వ్యవస్థ పై ప్రశ్నించి, మన హక్కుల సాధికారత కోసం రజకులు పోరాడాలి.

**రజకులపై నేటికీ మారని కుల వివక్షత**

తెలంగాణలో ఇప్పటికీ రజకులు వివక్షతకు గురవుతూనే ఉన్నారు నేటికీ కనిపిస్తున్నాయి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆరెగూడెం గ్రామంలో ఆనవాయితీగా గ్రామ దేవతలకు గుడిలో మృతి చేసేందుకు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రేటు పెంచి ఇవ్వాలి అన్నందుకు రజకులపై దాడి చేసి గ్రామ బహిష్కరణ జరిపించారు. అదే జిల్లా నెలకొండపల్లిలో, కులం పేరుతో దూషించి దాడులు చేయటం, ఖమ్మం టౌన్ లో మైనర్ బాలికపై అత్యాచారం, హత్యాయత్నం జరిపారు. నాగర్ కర్నూల్ కుమ్మెర గ్రామంలో దైవ దర్శనానికి వెళ్లిన రజక వృత్తిదారులను అడ్డుకోగా, ప్రశ్నించిన రజకుడి కుటుంబం పై దాడి చేయడం, ఆ సంఘటనలో ఆరు నెలల పసిపాప హత్యకు గురై చనిపోవడం యావత్తు తెలంగాణ సమాజాన్ని కలచివేసింది. నిజామాబాద్ జిల్లా జక్రైన్ పల్లి లో, శ్రమకు తగిన వేతనం అడిగినందుకు రజకులను, సామాజిక బహిష్కరణకు గురిచేసిన వివక్షత నిదర్శనంగా నిలిచింది. శంషాబాద్ లో వాలకుండను ప్రభుత్వ అధికారంలో ఉన్న రజక సర్పంచ్ పై కూడా దాడులు జరపారు. గద్వాల,నారాయణపేట జిల్లాలో భూమి వివాదంలో రజకులపై దాడి చేసి గాయపరిచారు.ఇతర కుల వృత్తిదారుల పైన కూడా సామాజిక బహిష్కరణలు జరుగుతున్నాయి. ప్రజల ఆలోచన మారాలి. కులం కంటే మనిషికి, శ్రమకి, వృత్తిని, గౌరవించడం ముఖ్యమని తెలంగాణ సమాజం తెలుసుకోవాలి. కుల మతాలకతీతంగా మారుతున్న కాలానికి అనుగుణంగా కులాంతర వివాహాలను, అంగీకరించి యువతకు భరోసా, రక్షణ కల్పించే విధంగా సమాజం మారాలి. సామాజిక బహిష్కరణలు మహిళలపై, దాడులు అత్యాచారాలు, కులవ్యవక్షతను అరికట్టేందుకు, రజకులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి. రజకులకు గత ప్రభుత్వమిచ్చిన అసైన్డ్,ఇనాం, భూములను, అగ్రవర్ణాల వారు దాడి చేసి,దౌర్జన్యంగా భూ ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వం హక్కు పత్రాలను మంజూరు చేసి రజకుల భూములని కాపాడాలి. గ్రామాలలో రజక కమిటీ హాల్ ,దోబిగాడు స్థలాలను కేటాయించి వారి అభ్యున్నతను పెంచాలి.

**హామీలకే పరిమితమైన బిసి డిక్లరేషన్**

ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు హామీలకు మాత్రమే పరిమితమయ్యాయి ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్తు పథకాన్ని 74,000 మంది పొందుతున్నప్పటికీ



మూడు సంవత్సరాలుగా విద్యుత్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల వృత్తిదారులపై అధిక భారం పడుతుంది.రాష్ట్ర ప్రభుత్వం రజక సంక్షేమానికి 200 కోట్ల బడ్జెట్ను కేటాయించింది. బడ్జెట్ ఉన్నప్పటికీ విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించకుండా, నిర్లక్ష్యం వివరిస్తూ ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, రజకులకు యుద్ధ ప్రతిపాదికన రజక రిజర్వేషన్ ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో రజక వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ జీవోలు 102,9 అమలు చేయాలి. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ను హామీలకే పరిమితం కాకుండా వృత్తి ఆధునీకరణకు, రజక యువతకు,మహిళలకు ఆర్థిక సహాయం, అందించి ఆధునిక మోడ్రన్ యంత్రాలపై శిక్షణ, వ్యక్తిగత సబ్సిడీ రుణాలు మంజూరుకు కృషి చేయాలి. రజక నిరుద్యోగ యువతకు, సారీ రోలింగ్, డ్రై క్లీనింగ్, స్ట్రీమ్ ఐరన్ తదితర షాపుల, జీవనోపాధికై వ్యక్తిగత సబ్సిడీ రుణాలు ప్రభుత్వం కల్పించాలి. . ప్రభుత్వ సంస్థలలో వృత్తి కాంట్రాక్టులు అన్ని కూడా రజకులకు కేటాయించాలి. వృత్తిరీత్యా, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రజకులకు పెన్షన్ మంజూరు చేయాలి. నిరుపేదలైన రజకులకి ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత కల్పించాలి. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా, సంస్కృతికంగా, వెనుకబడిన వృత్తిదారులకు చేయూతనిచ్చి ఆదుకోవాలి. రజకుల జీవితాలలో మార్పు కోసం,పాలక ప్రభుత్వం కృషి చేయాలి అని పెద్దాపురం భాస్కర్ డిమాండ్ చేశారు

# మోడలింగ్‌లో మెరిసిన వ్రూహా రామ్

## Mrs. Glam Gala 2026 Runner`Upగా హైదరాబాద్ యువతి ఘనత

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

హైదరాబాద్: చిన్ననాటి నుంచి మోడలింగ్‌పై ఉన్న ఆసక్తి, అభిరుచిని లక్ష్యంగా మార్చుకున్న హైదరాబాద్‌కు చెందిన వ్రూహా రామ్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించారు. Mrs. Glam Gala 2026 =బఅఅవతీ-ఖజూగా నిలిచి తన కలను సాకారం చేసుకున్నారు.వ్రూహా రామ్ వీదీూా గ్రాడ్యుయేట్‌తో పాటు ఫ్యాషన్ డిజైనర్‌గా, ప్రస్తుతం ఎ= మేనేజర్‌గా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచే మోడలింగ్‌పై ఆసక్తి ఉన్న ఆమెకు తన కలను అర్థం చేసుకున్న భర్త నుంచి విశేష ప్రోత్సాహం లభించింది. ప్రతి అడుగులోనూ అండగా నిలిచి, తన లక్ష్యాన్ని చేరుకునేలా భర్త అందించిన ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్నిచ్చిందని వ్రూహా రామ్ తెలిపారు.భర్త ప్రోత్సాహం, కుటుంబ సభ్యులుస్నేహితుల సహకారం, తన కృషి కలగలిసి ఈరోజు Mrs. Glam Gala 2026 Runner`Up అనే గౌరవప్రదమైన టైటిల్‌ను సాధించగలిగానని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన విజయానికి



అండగా నిలిచిన భర్తకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ వ్రూహా రామ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ అందమైన అవకాశాన్ని అందించిన ఎవజవత్ఓ టీమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.“ఈ టైటిల్ నాకు కేవలం ఒక పురస్కారం కాదు. నా కలను నిజం చేసుకున్న ఒక అందమైన ప్రయాణానికి గుర్తు. నన్ను నమ్మిన ప్రతి ఒక్కరి ప్రేమ, ప్రోత్సాహం నాకు ఎప్పటికీ ప్రత్యేకమే” అని



వ్రూహా రామ్ పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 సెప్టెంబర్ గురువారం 2026

# త్యాగాల తెలంగాణ వాస్తవ గాథ

## సెప్టెంబర్ 17 విలీనం, విమోచన కాదు ముమ్మాటికి దురాక్రమణ - న్యాయవాది సాయిని నరేందర్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి**

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 న జరిగింది ఏమిటో నేటికి మెజారిటీ తెలంగాణ ప్రజలకు తెలియదు అని సామాజిక రాజకీయ విశ్లేషకులు ప్రముఖ న్యాయవాది సాయిని నరేందర్ అన్నారు ఆనాటి రజాకర్ల, దేశ్ ముఖ్ ల, దొరల ఆగడాలు మాత్రమే సామాన్య ప్రజలకు తెలుసు ఆ క్రమంలోనే 1948 సెప్టెంబర్ 17 న దాడులు జరిగాయని తెలుసు. ఆ రోజు జరిగిందేమిటి? విలీనమా? విమోచనా? విద్రోహమా? దురాక్రమణ నా? అనేది ప్రతి సారి చర్చ జరుగుతూనే ఉంటుంది. ఏడు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ చరిత్ర సెప్టెంబర్ 17 ను విద్రోహ దినంగా తేల్చి చెప్పింది. ఇంకా చెప్పాలంటే ఆనాటి ఇండియా పాలకవర్గం వల్లబాయి పటేల్ నేతృత్వంలో 1948 సెప్టెంబర్ 17 న తెలంగాణను దురాక్రమణ చేశారు. చెరపలేని చరిత్రను, గత చారిత్రక సత్యాన్ని వివాదాస్పదం చేసి ప్రజల మన్నలను పొందాలని పాలక, ప్రతిపక్ష పార్టీల నేతలు కుటిల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు పదే పదే మోసపోతుంటారని కామ్రేడ్ లెనిన్ అన్నట్లు... నిజమైన చరిత్ర, ప్రజల త్యాగాలు నేటి తరం ప్రజలకు వివరించనంతకాలం పాలకవర్గాలు చెప్పిందే ప్రజలు నమ్మి మోసపోతారు. రాజకీయ ప్రయోజనాల కోసం పాలకవర్గం తెలంగాణ ప్రజల త్యాగాలను తక్కువచేస్తుంది. ఆనాడు దురాక్రమణ చేసిన పాలక కాంగ్రెస్ పార్టీ విలీనమని, మత కోణంలో లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపి విమోచనని, ప్రజల ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధమున్న కమ్యూనిస్టులు ముమ్మాటికీ విద్రోహమని గత 78 ఏండ్లుగా ప్రచారం చేసుకుంటూనే ఉన్నారు. నిజాం నిరంకుశ పాలనలో దేశ్ ముఖ్ లు, దొరలు, భూస్వాముల పెత్తనం, వెట్టి చాకిరి లాంటి ఆగడాలపై ఎర్రజెండా అండతో ఎదురు తిరిగారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా పంచాయతీలను ఏర్పాటు చేసి దొరల గడీల పాలనను రద్దు చేసింది. ప్రజలు వారి దైనందిన సమస్యలను వారే పరిష్కరించుకునే నాయకత్వాన్ని తయారు చేసుకున్నారు. దొర, పటేల్, పట్వారీ కుటిల వ్యవస్థను అరికట్టి ప్రజల ఏలుబడిని ఎత్తిపట్టి ప్రజాస్వామిక పాలనా సంస్కృతికి జీవం పోశారు. క్రమంగా హైదారాబాద్ రాష్ట్ర ప్రజలు పోరాటాన్ని ఉధృతం చేసి నైజాం పాలనను అంతమొందించే స్థాయికి వచ్చారు. వేలాది మంది మాన ప్రాణాలను దోచుకున్న ఊర్లలోని దొరలే కాదు నిజాం కూడా గద్దె దిగే పరిస్థితిని రైతాంగ పోరాటం కలిగించింది. నలువైపుల నుండి వస్తున్న పోరాట వార్తలు నిజాంను ఉక్కిరి బిక్కిరి చేశాయి. దీన్ని గమనించిన నిజాం పాలకులు ఆనాటి నెహ్రూ ప్రభుత్వంతో కుమ్మక్కయి "ఆపరేషన్ పోలో" పేరుతో వచ్చిన భారత సైన్యం నిజాం లొంగిపోయిన వెనుదిరిగి వెళ్ళకుండా తెలంగాణ ప్రజలపై దాడులు చేసి లక్షల మంది ప్రజలను చంపి, హింసించి తెలంగాణను దురాక్రమణ చేశారు. నిజాం లొంగిపోయాడని దొంగ మాటలు చెప్పిన పటేల్ ప్రజలపై దారుణమైన హింసకు పాల్పడిన ఖాసీం రజ్వి ని చాటుగా దాటించారు. ఊర్ల నుండి పారిపోయిన దొరలు కాంగ్రెస్ టోపీలతో గ్రామాల్లోకి చేరుకునేలా సైన్యం అండనిచ్చింది. దొరలకు రాజకీయ పదవులు కట్టబెట్టి ప్రజాస్వామిక ప్రతినిధులు అనే రూపాన్ని ఇచ్చి ప్రజలు ఏర్పాటు చేసుకున్న ప్రజా పంచాయితీలను కూల్చి ప్రజలను వంచించారు. ప్రజల వైపున పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులను మట్టుపెట్టేందుకు నెహ్రూ సేనలు పూనుకున్నాయి. హైదరాబాద్ రాష్ట్రం మీద నెహ్రూ–పటేల్ సర్కార్ సైనిక చర్య తెలంగాణ చరిత్రలో మాయని మచ్చ. ఆ సైనిక చర్య పురోగమిస్తున్న తెలంగాణ పీడిత ప్రజల విప్లవాన్ని ఊబిలోకి నెట్టింది. నిజాంను లొంగదీసుకోవడానికి వచ్చినట్లు చెపుతున్న సైన్యం అప్పుడప్పుడే భారత జనతా ప్రజాతంత్ర విప్లవానికి దారి చూపిస్తున్న వేగు చుక్కను హతమార్చింది. ఇంతటి దుర్మార్గాన్ని, దురాక్రమణను, విద్రోహాన్ని రాజకీయ పార్టీలు సుదినంగా చిత్రించబోవడం విషాదకరం. హైదరాబాద్ స్టేట్ ఇండియాలో భాగం కానప్పటికి అవకాశవాద పాలనకు అలవాటుపడిన నిజాం పాలకులు మొదటి నుండి బ్రిటిష్ పాలకులతో సన్నిహితంగానే మెదులుకుంటున్నారు. టిప్పు సుల్తాన్ ను హతమార్చడంలో ఇంగ్లీష్ పాలకులతో విద్రోహ బుద్ధితో చేతులు కలిపిన నిజాం పాలకులు 1948 సెప్టెంబర్ 17 న నెహ్రూ ప్రభుత్వంతో చేతులు కలిపి తెలంగాణ ప్రజలను వంచించి, తెలంగాణ పోరాటాన్ని, తెలంగాణ ప్రజల స్వేచ్ఛను హరించివేశారు. తెలంగాణ ప్రజల పోరాటాన్ని ఎదుర్కోలేని నిజాం పాలకులు, తెలంగాణ సంపదపై కన్నేసిన ఆంధ్ర సంపన్నులు, తెలంగాణ మన చేతికి రాకుంటే కమ్యూనిస్ట్ పోరాటాల ద్వారా భవిషత్ లో మన అధికారానికే ముప్పు వాటిల్లుతుందని భావించిన కాంగ్రెస్ లు కలసి సెప్టెంబర్ 17 దాడి చేశారు. ఈ దాడి తాడిత పీడిత ప్రజలపై సామ్రాజ్యవాదులు మూకుమ్మడిగా చేసిన దుర్మార్గపు చర్యగా చరిత్రలో నిలిచిపోయింది. ఇండియాకు స్వాతంత్రం ఇచ్చే క్రమంలో తెలంగాణ లాంటి స్వతంత్ర సంస్థానాలు మా పాలనలో ఎన్నడూ లేవని వారి సంస్కృతి, జీవనం, సామాజిక, ఆర్థిక స్థితిగతులు వేరని వారికి ఇష్టం లేకుంటే ఆ ప్రాంతాలను మీరు స్వతంత్రంగానే వొదిలెయ్యాలని బ్రిటిష్ పాలకులు చాలా సూటిగా చెప్పారు. దేశంలో అధికారమే పరమవాదిగా స్వాతంత్ర ఉద్యమం చేసిన బ్రాహ్మణీయ శక్తులు అంబేద్కర్ ఉద్యమం వల్ల దళిత ముస్లింల ఐక్యత చూసిన నాయకులు కావాలనే గాంధీని ముందుపెట్టి లార్డ్ మౌంట్ బాటన్ తో రహస్య ఒప్పందం కుదుర్చుకొని ముస్లింలు అధిక జనాభా కలిగిన ప్రాంతాన్ని పాకిస్థాన్ దేశంగా విభజించారు. పాకిస్థాన్ విభజన వల్లనే దేశంలో బ్రాహ్మణ, బనియా వర్గాలకు అధికారం వచ్చింది. బ్రిటిష్ వాళ్ల నుండి బ్రిటిష్ పాలించిన ప్రాంతానికి మాత్రమే స్వాతంత్రం వచ్చింది. హైదరాబాద్, కాశ్మీర్ లాంటి పెద్ద సామంత రాజ్యాలకు ఇది వర్తించదు. బ్రిటిష్ పాలనకన్నా ముందునుండే స్వతంత్రంగా ఉన్న తెలంగాణపై కన్నేసిన కాంగ్రెస్ పాలకులు ఎలాగైనా తెలంగాణను ఆక్రమించుకోవాలని తెలంగాణ పై పోలీసు దాడి చేసి దుర్మార్గానికి ఒడికట్టారు. హైదరాబాద్ సంస్థానంలో పాలన రెండు విధాలుగా సాగింది. ఒకటి నిజాం రాజ్యం ప్రత్యక్ష పాలనలో ఉండే ప్రాంతం ఈ ప్రాంతాన్ని సర్ఫేఖాన్ అనేవారు. రెండోది నిజాం పరోక్ష పాలనలో ఉండే ప్రాంతం. ఈ ప్రాంతం జమీందారులు, దొరలు, భూస్వాములు, దేశ్ ముఖ్ ల ఆధీనంలో ఉండేది. వీరు ఆ ప్రాంతం నుండి శిస్తులు వసూలు చేసి నిజాంకు చెల్లించేవారు. ఆయా ప్రాంతాల్లో పాలన చేసిన జాగీర్ దారులు నిజాం అండతో చేయని దుర్మార్గాలు లేవు. భూస్వాములు, దొరల నిరంకుశత్వం వల్ల 1910 లోనే నిజాం రాజు నిషేధించిన వెట్టి చాకిరి తెలంగాణ పరోక్ష పాలనలో కొనసాగింది. అణగారిన వర్గాల ప్రజలకు ప్రత్యక్ష పాలనలో దొరికిన చట్టపరమైన వెసులుబాట్లు భూస్వాముల పాలనలో లభించలేదు. వెట్టి చాకిరికి, దొరల పీడనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు ఉద్యమానికి ఆనాటి కమ్యూనిస్టులు నాయకత్వం వహించి ప్రజలను సాయుధ పోరాటం వైపు మరలించి గ్రామ గ్రామాన స్వయం రక్షక దళాలను ఏర్పాటు చేసి దొరల, భూస్వాముల ఆగడాలను, దోపిడీని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆంధ్ర మహాసభ పేరుతో ప్రారంభమైన భూస్వామ్య వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం హైదరాబాద్ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసింది. ఆనాటి కాంగ్రెస్ పార్టీ, ఆర్య సమాజం జమీందార్లకు, భూస్వాములకు వత్తాసు పలికాయి. నిజాం రాజుకు, దొరలకు ఈ సంస్థలు వ్యతిరేకం కాదు. న్యాయమైన హక్కుల కోసం, విముక్తి కొరకు పోరాటం చేస్తున్న అణగారిన వర్గాల ప్రజలకు ఈ సంస్థలు వ్యతిరేకంగా పని చేశాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సాగిన పోరాటం దొరలను తరిమి గడీలను ఆక్రమించుకొని ప్రజారాజ్యం నిర్మించుకున్న ప్రజలను నిజాం ఎదుర్కోలేక పోయాడు. అణగారిన ప్రజలకు, కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు నిజాంతో కుమ్మక్కయి తెలంగాణ ప్రజల మీద పోలీసు యాక్షన్ చేసి దురాక్రమణ చేసారు. నెహ్రూ సైన్యం దురాక్రమణ చేసిన తర్వాత ఎవరికి నష్టం జరిగింది? ఎవరికి లాభం జరిగింది? ప్రజల పోరాటాలకు జడిసి పట్టణాలకు పారిపోయిన దొరలు, భూస్వాములు పల్లెలకు వచ్చారు. 1948 వరకు పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటంలో 400 మంది మరణిస్తే దేశానికి స్వాతంత్రం వచ్చి తెలంగాణ దురాక్రమణ జరిగిన 1948 నుండి 1950 వరకు సైన్యం జరిపిన హత్యాకాండలో నాలుగు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా కర్ణాటక, మరట్వాడ ప్రాంతాల్లో మతం మారిన ఎస్సి, ఎస్టీ, బి.సి లను సుమారు రెండు లక్షల మందిని ఊచ కోత కోసారని, ముస్లింల నెత్తురు కాల్వలుగా పారాయని వీటిపై కేంద్రం నియమించిన పండిట్ సుందర్ లాల్ కమిటీ నిర్ధారించింది. ఉస్మానాబాద్, నాందేడ్, గుల్బర్గా, బీదర్ జిల్లాలు నాలుగింటిలోనే 18 వేల మందికి పైగా హత్యకు గురయ్యారు. మొత్తం సంస్థానంలో 40 వేల వరకు హతులైనట్లు సుందర్ లాల్ నివేదిక పేర్కొనగా ఈ మృతుల సంఖ్య రెండు లక్షలు ఉండవచ్చని ఉద్యమ సంస్థల నివేదికలు చెపుతున్నాయి. పోలీసు యాక్షన్ వల్ల గ్రామాలు వల్లకాడుగా మారాయి. లక్షల మంది హింసించబడ్డారు. రెండు లక్షల మంది కాన్సంట్రేషన్ క్యాంపులో నిర్బంధం అనుభవించారు. ఇల్లందు, ములుగు, నర్సంపేట, పాల్వంచ, కొత్తగూడెం, బూర్గంపాడు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో వెయ్యికి పైగా ఏజెన్సీ గిరిజన గ్రామాలను తగులబెట్టారు. గిరిజన మృతుల సంఖ్య వెలుగులోకి రాలేదు. ఐదు వేల మంది మహిళలు మిలటరీ అత్యాచారాలకు గురయ్యారు. నాలుగు వేల మందిని చంపి, రెండు లక్షల మందిని ఊచ కోత కోసి దురాక్రమణ చేసి ప్రజల మాన ప్రాణాలను హరించివేసిన సైనిక చర్యను కాంగ్రెస్ నేతలు విలీనం అంటున్నారు. విలీనమంటే ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగి శాంతియుతంగా జరగాలి. ముస్లింలను ఊచ కోత కోసి, ముస్లిం పాలన పోయి బ్రాహ్మణ పాలన వచ్చినందున ఇది విమోచన అంటుంది బిజెపి. నిజాం రాజు అధికారాలేవి 1956 వరకు తొలిగించలేదు. సైనిక చర్య తర్వాత నిజాం సైన్యం, నెహ్రూ సైన్యం, కాంగ్రెస్ పార్టీ వాలేంటీర్లు ఒక్కటై నరమేధం సాగించాయి. హైదరాబాద్ సర్వోన్నత అధికారిగా, రాజప్రముఖ్ గా నిజాం రాజు విశేష అధికారాలు అనుభవించాడు. ఆయన ఆస్తులు, అధికారాలకు బ్రాహ్మణ పాలకులు రక్షణ కల్పించారు. తెలంగాణ ను ఆంధ్రాలో కలిపే 1956 వరకు నిజాం రాజు చేతిలోనే అధికారం ఉంది. శాంతి భద్రతలు, విదేశాంగ వ్యవహారాలు, రక్షణ ఇండియన్ ప్రభుత్వ పరిధిలో ఉండగా సివిల్, క్రిమినల్, రెవిన్యూ జ్యుడిషియల్ అధికారాలన్నీ పాత పద్ధతిలో నిజాం రాజు ఆధీనంలో ఉన్నాయి. ఎవరినుండి ఎవరికి విమోచన వచ్చినట్లు? ప్రజల నుండి నిజాం పాలకులకు విమోచన కలిగింది. ప్రజల నుండి దొరలు, భూస్వాములకు విమోచన కలిగింది. నిజాం నుండి కాంగ్రెస్ పార్టీకి అధికార మార్పిడి జరిగింది. దీన్ని ఎలా విమోచన అంటారో ఉత్సవాలు చేసుకునే బిజెపి చెప్పాలి. కమ్యూనిస్టులు ఇది విద్రోహం అంటున్నారు. ద్రోహం చేయాలంటే ముందు విశ్వాసం కల్పించాలి. ఆ విశ్వాశానికి విరుద్ధంగా వ్యవహరిస్తే అది విద్రోహం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ 1946 నుండి నేటివరకు అలాంటి విశ్వాసం కల్పించలేదు. అది నేరుగా దురాక్రమణకే తెగబడింది. తెలంగాణను ఆంధ్రలో కలపడం కూడా దురాక్రమణనే. అందువల్ల కమ్యూనిస్టులు చెపుతున్నట్లు ఇది విద్రోహ దినం కాదు. సెప్టెంబర్ 17 విషయమై తెలంగాణ ఉద్యమ సమయంలో, తెలంగాణ సాధించిన తర్వాత నుండి ఇప్పటివరకు కిమ్మనకుండా ఉన్న కెసిఆర్ ప్రభుత్వం తన పాలన కాలంలో కొత్త రాగం ఎత్తుకుని సెప్టెంబర్ 17 ను 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినం' గా పాటించి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిజెపి లాగా హిందువులను వెనుకేసుకొని రాకుండా కాంగ్రెస్ లాగా ముస్లింలను వెనుకేసుకోకుండా మధ్యస్థంగా కెసిఆర్ వ్యూహాత్మకంగా మెదులున్నాడు కాని తెలంగాణలో వాస్తవంగా జరిగిన మారణ కాండన చరిత్రను బహిర్గతపరచలేదు. సెప్టెంబర్ 17 న జరిగిన చరిత్ర సాక్షాలు చరిత్రలో లిఖించబడి ఉండగా ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు సెప్టెంబర్ 17 చరిత్రను వారికి అనుకూలంగా వాడుకుంటునన్న వారిలో కెసిఆర్ కూడా చేరాడు. మొత్తంగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప మరో అంశం కనపడడం లేదు. దేశమంతా బ్రిటిష్ పాలనలో కొంత అభివృద్ధి చెంది, ప్రజలు విద్య నేర్చుకొనగా తెలంగాణ మాత్రం 400 ఏండ్లు నిజాం పాలనలో విద్యకు, అభివృద్ధికి దూరమయ్యారు. పోరాటాలతో తరతరాలు నష్టపోయారు. అలాంటి తెలంగాణను అప్పటికే అన్ని రంగాల్లో అభివృద్ధిలో ఉన్న సీమాంధ్రతో కలపడం వల్ల చాలా నష్టం జరిగింది. ఉద్యోగాలు, ఉన్నత విద్యలో సీట్లు, రాజకీయ అవకాశాలు, వ్యాపారాల్లో అవకాశాలు అన్ని తెలంగాణకు దక్కకుండా పోయాయి. ఇంతటి అన్యాయం జరిగిన తెలంగాణ కోసం ఎలాంటి అభివృద్ధి చేయాలో ఆలోచించాల్సిన రాజకీయ పార్టీలు ప్రతి అంశాన్ని వక్రీకరించి రాజకీయ రంగులు పులిమి ఆటలు ఆడుచున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా తెలంగాణ గోసను, తెలంగాణ చరిత్రను రాజకీయాలకు వాడుకోవడం ఆపి తెలంగాణ అభివృద్ధికి ప్రణాళికలు వేయాలి. నిజాం కాలం నుండి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు జరిగిన అన్ని రకాల ఉద్యమాల్లో నష్టపోయిన కుటుంబాలను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి అన్ని రకాల సహాయం అందించాలి. ఏ కోణంలో చూసిన సెప్టెంబర్ 17 న తెలంగాణ ప్రజల మీద ఏక పక్ష దాడి తో పాటు దురాక్రమణ జరిగింది. ఈ దురాక్రమణ వల్లే తెలంగాణ ప్రాంతాన్ని బాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో బ్రాహ్మణ పాలకులు ఆంధ్ర రాష్ట్రంలో బలవంతంగా కలిపారు. ఇది రెండో దురాక్రమణ. రెండు సార్లు దురాక్రమణకు గురైన తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత దోపిడీకి గురైనది. కాంగ్రెస్ పార్టీ నైజం తెలుసుకొని వినోభా బావే భూదానోద్యమం ఎవరికి మేలు చేసిందో ప్రజలు ప్రత్యక్షంగా చూసారు. దురాక్రమణలను, దోపిడీ పీడనలను తట్టుకోలేని ప్రజలు మళ్ళీ విప్లవ బాట పట్టారు. నక్సలైట్ల ఉద్యమంలో చేరి దొరల, భూస్వాముల ఆగడాలపై తిరగబడ్డారు. రూపం మార్చి దోపిడీ కొనసాగిస్తున్న భూస్వాముల భూములను పేద ప్రజలు పంచుకొని దొరలను మళ్ళీ గ్రామాల నుండి ప్రారదోలారు. 1995 లో మారోజు వీరన్న నాయకత్వంలో మలిదశ ఉద్యమం మొదలై ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. త్యాగాల పునాదుల మీద రాష్ట్రం సాదించాక మళ్ళీ అదే తంతు పునరావృతమైంది. భూములు వొదిలి వెళ్లిన దొరలు భూస్వాములు గ్రామాల్లోకి వచ్చి అణగారిన వర్గాల ప్రజల నుండి భూములు గుంజుకొని దోపిడీని కొనసాగిస్తున్నారు. తెలంగాణ అణగారిన శ్రామిక వర్గాల విముక్తి కోసం మరో పోరాటం అవసరమని ప్రజల నుండి మరో భలమైన పోరు నినాదం వినిపిస్తుంది అని ఉద్బోధించారు.










